



ఆశలపై నీళ్లు!

కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎలాంటి కేటాయింపులు జరగకపోవడం నిరాశను కలిగించింది. అంతేకాకుండా మెట్రోరైలు విస్తరణ, కృష్ణా రైల్వే ప్రాజెక్టు, హైస్పీడ్ రైళ్లపై కూడా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే కేంద్ర బడ్జెట్ వేతన జీవులు, మధ్యతరగతి వర్గాలతో పాటు రైతులకు ప్రయోజనకరంగా ఉంది. ఆదాయపన్నుకు సంబంధించి వేతనజీవులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు తక్కువ వడ్డీకి ఇచ్చే కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితిని కేంద్రం రూ.3లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. అలాగే సూక్ష్మ సంస్థలకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు చేయూత లభించనుంది.

- కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు శూన్యం
- వేతన జీవులకు ఊరట
- ఆదాయపన్నులో వెసులుబాటు
- రైతాంగానికి తీపి కబురు
- కంది రైతులకు మంచి రోజులు
- కేంద్ర ఏజెన్సీల ద్వారా నేరుగా కంది కొనుగోలు
- ఎంఎస్‌ఎంఈలకు భారీగా రుణాలు పెంపు
- జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు



ప్రాజెక్టులకు మొండిచేయి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో తలపెట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల ఊసే లేదు. ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే కేంద్రాన్ని కోరింది. అయితే ఈ బడ్జెట్‌లో ఈ విషయం అసలు ప్రస్తావనకే రాలేదు. అలాగే నగర శివార్లలో ఏర్పాటు చేయదలిచిన ఫ్యూచర్ సిటీకి మెట్రోరైలు విస్తరణ, కృష్ణా రైల్వే ప్రాజెక్టు, హైస్పీడ్ రైళ్లపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. రైల్వేకి సంబంధించిన బడ్జెట్ పూర్తి వివరాలు రావడానికి కొంత సమయం పట్టవచ్చు. అయితే కీలక అంశాలు ముందుగానే వెల్లడించే అవకాశం ఉన్నా ఇంత వరకు వీటిపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో కీలక ప్రాజెక్టులు అటకెక్కినట్లుగానే భావిస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు మధ్య తరగతి వర్గాలతో పాటు రైతులకు ప్రయోజకరంగా ఉంది. ఆదాయపన్నుకు సంబంధించి వేతనజీవులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.12లక్షల వరకు ఆదాయం కలవారికి పూర్తిగా పన్నుమినహాయింపు లభించనుంది. అయితే సేవింగ్స్ చేసే వారికే ఈ పూర్తి ప్రయోజనం కలగనుంది. గతంలో ఉన్న శ్లాబ్ విధానాలను సవరించారు. కొత్త విధానం వల్ల వేతన జీవులకు ఏడాదికి గరిష్ఠంగా రూ. 1.10లక్షల వరకు ఆదా కానుంది. పీఎం ఆరోగ్య యోజన కింద గిగ్ వర్కర్లకు అంటే స్విగ్గీతో పాటు ఆన్‌లైన్ డెలివరీ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు బీమా పథకాన్ని అమలు చేయనున్నారు. వృద్ధులకు వడ్డీపై వచ్చే ఆదాయానికి సంబంధించి వెసులుబాటు కల్పించారు. టీడీఎస్ పరిమితి రూ.50 నుంచి రూ.లక్ష వరకు పెంచారు. అలాగే గతంలో

మిగతా 8వ పేజీలో...

ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం

సూక్ష్మ సంస్థలకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలకు చేయూత లభించనుంది. ఎంఎస్ఎంఈ రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు రుణపరిమితి పెంచడంతోపాటు స్టార్టప్ లకు రూ.20 కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నారు. 27 రంగాల్లో స్టార్టప్ రుణాలకు ప్రత్యేక కార్యాచరణ నమోదు చేసుకున్న సంస్థలకు రూ. 5లక్షల వరకు క్రెడిట్ కార్డు రుణం ఇవ్వనున్నారు. సూక్ష్మ పరిశ్రమలు ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అధికంగా ఉన్న విషయం తెలిసిందే. రుణ ప్రోత్సాహంతో వేలాది మందికి ప్రయోజనం దక్కనుంది. మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళల కోసం ప్రత్యేక టర్మ్ లోన్ పథకాన్ని తీసుకురానున్నారు.. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే ఆయా వర్గాల మహిళలకు వచ్చే ఐదేళ్లలో రూ.2 కోట్ల వరకు రుణాలను ఈ పథకం కింద అందిస్తారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. అలాగే ఈ పథకం ద్వారా దేశంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలకు కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. విదేశాల్లో చదువుకునేందుకు విద్యార్థులు తీసుకునే విద్యా రుణాలపై ప్రస్తుతం వసూలు చేస్తోన్న టీసీఎస్(ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్)ను పూర్తిగా ఎత్తేసింది. దీంతో పాటు విదేశాలకు చేసే నగదు బదిలీలపై వసూలు చేసే టీసీఎస్ మినహాయింపు పరిమితిని రూ.7లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. దీంతో తమ పిల్లలను విద్య కోసం విదేశాలకు పంపే తల్లితండ్రులకు కొంత ఆర్థిక ఊరట లభించింది.

ఎవరేమన్నారంటే..?

పేదలకు వ్యతిరేకం



పరిగి: బీజేపీది పేదల వ్యతిరేక బడ్జెట్. వ్యవసాయ బడ్జెట్ ఏ మూలకు సరిపోదు. నిధుల కేటాయింపు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంది. సాగునీటి జలాల కేటాయింపులపై వివక్ష చూపారు. రాష్ట్రానికి కేటాయింపుల విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విఫలమయ్యారు. కేంద్రబడ్జెట్‌పై కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్తుంది.

- టి. రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే

నిరాశ పరిచింది



రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. బడ్జెట్ చాలా నిరాశకు గురిచేసింది. రాష్ట్రానికి తగినంత కేటాయింపులు రాలేదు. కేంద్రం ఇచ్చిన హామీలను విస్మరించారు. ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణపై ప్రేమ చూపడం లేదు. ఈ ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రులు ఇప్పటికైనా ఆలోచించాలి.

-సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు

కొన్ని రాష్ట్రాలకే పరిమితం



కేంద్ర బడ్జెట్‌ను చూస్తే కొన్ని రాష్ట్రాలకే పరిమితమనిపించేలా బడ్జెట్ కనిపిస్తోంది. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి మిగతా రాష్ట్రాలకు కేంద్రం మొండి చెయ్యి చూపించింది. రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రజలకు ఎలాంటి కేటాయింపులు లేవు. ఎన్నికల బడ్జెట్‌గా ఉంది.

- డాక్టర్ మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే

అంకెల గారడీ



బడ్జెట్ అంకెల గారడిగా ఉంది. ఈ విశేషాలు పరిశీలిస్తే కాగితాలకే పరిమితమయ్యేలా కనిపిస్తోంది. రైతులకు, కార్మికులకు, బలహీన వర్గాలకు, దళిత, గిరిజనులకు వ్యవసాయ కూలీలకు ఉపాధి కూలీలకు అనుకూలంగా లేదు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధికి ఎక్కువ బడ్జెట్ కేటాయించాలి.

- మహిపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి, వికారాబాద్

'క్రాప్‌లోన్' పెంచడం హర్షం



ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అని వర్గాలు హర్షించే విధంగా ఉంది. మధ్య తరగతి ప్రజలకు, వేతన జీవులకు రూ.12.75 లక్షల వరకు మినహాయింపు, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల్లో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకు క్రాప్‌లోన్ సదుపాయం కల్పించడం ప్రశంసనీయం.

- కోకట్ మాధవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్





కార్యాలయ ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వేసవిలో విద్యుత్ కష్టాలు రానీయం

వికారాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ కష్టాలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. నారాయణపూర్ గ్రామంలో రూ. 2.43 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ ఉప కేంద్రం, జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో రూ. 3.13 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ ఉప కేంద్రాలకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుతో పంటలకు నిరంతర విద్యుత్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి, డిప్యూటీ ఇంజినీర్లు సంజీవ్, సూర్య, ఎండీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ పరార్.. భక్తులు పరేషాన్



రోడ్డుపై నిరీక్షిస్తున్న భక్తులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్తున్న భక్తులకు ఓ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ షాకిచ్చాడు. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి భక్తుల వంతయింది. ఈ ఘటన శనివారం మేడ్చల్‌లో చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంభమేళాలో నదీ స్నానం ఆచరించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌కు చెందిన భక్తులు బెంగళూరు నుంచి బయలుదేరారు. హైదరాబాద్‌కు రాగానే బస్సులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో బస్సు డ్రైవర్ మెహిదీపట్నంలో మరో బస్సును ఏర్పాటు చేశారు. బస్సు మారడంతో ఆన్‌లైన్‌లో బెర్తులు బుక్ చేసుకున్న వారికి అనుకున్న స్లీపర్ సీట్లు రాకపోవడంతో డ్రైవర్‌తో వాదనకు దిగారు. ఎలాగోలా అక్కడి నుంచి బయలుదేరిన బస్సును మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆ డ్రైవర్ మేడ్చల్‌లో నిలిపి ఎటో వెళ్లిపోయాడు. దీంతో గంటల తరబడి రోడ్డుపైనే నిరీక్షించారు. ఎంతకూ డ్రైవర్ రాకపోవడంతో ట్రావెల్స్ నిర్వాహకులకు ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితి చూసి ట్రావెల్స్ వారితో ఫోన్లో మాట్లాడారు. రాత్రి 8గంటలకు వేరే డ్రైవర్‌ను అక్కడికి పంపి బస్సును కదిలించారు.

కొడంగల్ నుంచే దండయాత్ర

రేవంత్‌ను ఓడగొట్టేది పట్నమే..

లగచర్లలో భూములు లాక్కుంటే ఊరుకోం.. తులం బంగారంపై నిలదీద్దాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పరిగి/కులకచర్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి సీఎంగా విఫలమయ్యాడని, హామీలపై మాటతప్పిన సీఎంపై కొడంగల్ నుంచే దండయాత్ర చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు అన్నారు. కులకచర్ల మండలం దాస్యానాయక్‌తండాలో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీమంత్రులు మహమూద్‌అలీ, సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు రాజు, నవీన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'రేవంత్ రెడ్డి ఇగ తిట్ల పురాణం బంద్‌చేయి.. నీ హనీమూన్ కూడా అయిపోయింది. ఇక ముంగిట ఉన్నది సినిమానే.. అసెంబ్లీకి రా.. అని కేసీఆర్‌ను అనడం కాదు.. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా లగచర్లకు రా.. నేను కూడా వస్తా.. నీ సంగతేమిటో ప్రజలు చూపిస్తారు' అని సవాల్ విసిరారు. లగచర్ల, నల్లగొండ రైతుల కోసం ధర్నా చేస్తామంటే రేవంత్ పర్మిషన్ ఇయ్యనీయడు.. బాజాప్తా త్వరలోనే కొడంగల్‌కు పోతాం.. మీటింగ్ పెడతామని స్పష్టం చేశారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడగొట్టేది పట్నం నరేందర్‌రెడ్డి మాత్రమేన్నారు. లగచర్లలో రైతుల వద్ద బలవంతంగా భూములు లాక్కుంటే ఊరుకోమని స్పష్టం చేశారు. ప్రతీ ఎకరానికి రూ.17,500 ఇచ్చే వరకూ వదిలిపెట్టొద్దని, తులం బంగారం ఏమైందని మహిళలు నిలదీయాలన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ అయ్యిందని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా కాదు..

- మిగతా 10వ పేజీలో..



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో కేటీఆర్, మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

రైతు భరోసా వచ్చిందా?

- మహిళా రైతులతో కేటీఆర్

దోమ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా వచ్చిందా..? అని మహిళా రైతులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. శనివారం కులకచర్ల మండలంలోని దాస్యనాయక్ తండాకు వెళ్తున్న క్రమంలో మోత్కూర్ గేటు దగ్గర పార్టీ జెండా ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అక్కడే ఉన్న మహిళా రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో రైతులను నట్టేటా ముంచిందని ఆరోపించారు.

151 మంది బాలలకు విముక్తి

ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 11వ విడతలో జిల్లా వ్యాప్తంగా 151 మంది బాలకార్మికులను గుర్తించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాల కార్మికులను గుర్తించామని, ఇందులో 42మంది ఇతర రాష్ట్రాలకు చెందిన ఉన్నారని పేర్కొన్నారు. పిల్లలందరినీ వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా బాలలను పనిలో పెట్టుకున్న 19 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే 100కు సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్ స్మైల్‌లో పాల్గొన్న ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

- 10 నుంచి మాత్రల పంపిణీ
- అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని మేడ్చల్ - మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన నేషనల్ వార్మింగ్ డే సమీక్షకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రఘునాథరావుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల నివారణకు జిల్లాలో 19 ఏళ్ల లోపు ఉన్నవారికి అల్బెండాజోల్ మాత్రలు వేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ మాత్రలు అందించాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులు సగం మాత్ర చప్పరించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 17న మాపప్ డే నిర్వహించి అందుబాటులో లేని పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అనంతరం మాతా శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. చిన్నచిన్న సమస్యలతో శిశువుల మరణాలు సంభవిస్తున్నాయని, అలా జరుగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత బాలింతలు, వారి కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. బిడ్డలో ఆరోగ్య సమస్య ఉంటే చికిత్సకు కాలయాపన జరుగకుండా చూసే బాధ్యత వైద్యులదేనన్నారు. జిల్లాలో మొత్తం ఐదు శిశు మరణాల కేసులు నమోదయ్యాయని, అందులో రెండు వలసదారులవి ఉన్నాయన్నారు. వలసదారులకు సైతం అవగాహన కల్పించి శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతుల సహకారం అభినందనీయం

కొడంగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రాంత అభివృద్ధిలో రైతుల సహకారం అభినందనీయమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు దుద్యాల మండలంలోని పోలెపల్లికి చెందిన 38 మంది రైతులకు శనివారం జిల్లా కేంద్రం వికారాబాద్‌లో నష్టపరిహారం చెక్కులు అందించి శాలువాలతో సన్మానించారు. భూములిచ్చిన రైతులకు పరిహారంతోపాటు ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.



రైతులకు పరిహారం చెక్కులు అందిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఆధునిక హంగులతో గ్రంథాలయం

వికారాబాద్: ఆధునిక హంగులతో నూతన గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుకుందామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులతో కాసేపు మాట్లాడారు. రెండు కంప్యూటర్లను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. సమాచార చిత్రపటాలను గోడలపై అతికించాలని కార్యదర్శి సురేష్‌బాబుకు ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, కార్యదర్శి సురేష్‌బాబు ఉన్నారు.

సంపులో పడి చిన్నారి మృతి

పాలిషింగ్ యూనిట్ వద్ద తల్లిదండ్రుల రోదన

తాండూరు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లిన చిన్నారి సంపులో పడి మృతిచెందింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్-చించోళి రోడ్డులోని పాలిషింగ్ యూనిట్‌లో శనివారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఏఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం బేగంపూర్ తాలూకా పూర్ణియా ప్రాంతానికి చెందిన వలస కుటుంబంమెహరాజ్ ఖాతూన్, హసీనా దంపతులు గౌతాపూర్ శివారులోని అజార్ పాలిషింగ్ యూనిట్‌లో నాపరాతి గనిలో పనిచేస్తున్నారు. వారికి కూతురు మహీఖాతూన్(మూడున్నరేళ్లు), కొడుకు సహేట్ ఉన్నారు. వీరు ఆరు నెలలుగా ఈ పాలిషింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 7గంటల సమయంలో యూనిట్ పైభాగం గదిలో నుంచి చిన్నారి మహి ఆడుకుంటూ బయటికొచ్చింది. ప్రమాదవశాత్తు గది వెనుక ఉన్న సంపులో పడిపోయింది. కూతురు కనిపించక తల్లిదండ్రులు వెతికారు. సంపులో చూసి మహిఖాతూన్‌ను గుర్తించారు. వెంటనే చిన్నారిని సంపులో నుంచి బయటికి తీసి తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి తాండూరు శివారులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి చిన్నారి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో ఈ సంఘటనపై చిన్నారి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆశలపై నీళ్లు!

(7వ పేజీ తరువాయి)

అద్దె ద్వారా వచ్చే ఆదాయం 2.5లక్షలకు మించితే పన్ను విధించేవారు. ఇపుడు ఈ మొత్తాన్ని రూ.6లక్షలకు పెంచారు. తాగునీటికి ప్రాధాన్యత పెంచారు. 100 శాతం ఇళ్లకు కుళాయి నీటి సరఫరా చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. క్యాన్సర్ దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పీహెచ్‌సీలకు భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వనున్నారు.

రైతులకు తీపి కబురు

రైతులకు తక్కువ వడ్డీకి ఇచ్చే కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణపరిమితిని కేంద్రం రూ.3లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని దాదాపు 8 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. కిసాన్ క్రెడిట్‌కార్డు పథకం కింద రైతులకు 9శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్నారు. ఇందులో ప్రభుత్వం 2శాతం వడ్డీ భరిస్తుంది. సకాలంలో వడ్డీ చెల్లిస్తే రైతులకు 3శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నారు. మొత్తం మీద చూస్తే నాలుగు శాతానికే రైతులకు వడ్డీ పరిమితం కానుంది. పప్పుధాన్యాల స్వయం సమృద్ధి కోసం మిషన్ ఫర్ ఆత్మ నిర్భరత ఇన్ పల్సెస్ అనే పథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. దీని కింద కంది, మినుము, మసూర్ వంటి పప్పుధాన్యాలు పండించే రైతుల ఉత్పత్తులు కొనేందుకు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. కేంద్ర ఏజెన్సీల ద్వారా వీటిని కొనుగోలు చేయనుంది. ఈ నిర్ణయంతో కంది అత్యధికంగా పండించే వికారాబాద్ జిల్లా రైతాంగానికి మేలు జరగనుంది. ముఖ్యంగా తాండూరు రైతులకు ఎక్కువ ప్రయోజనం కలగనుంది. అలాగే ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన కింద వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం ఇవ్వనున్నారు. గోదాములు, నీటి పారుదల, రుణ సౌకర్యం కల్పనకు భారీగా నిధులు కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు కూడా లబ్ధి చేకూరనుంది. దేశంలోని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో మూడేళ్లలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో మూడు జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటవుతాయి.

ధారూరులో కంది, వేరుశనగ బీట్లు

ధారూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం కందులు క్వింటాలుకు రూ.7,150 నుంచి రూ.7,330ల వరకు, వేరుశనగ క్వింటాలుకు రూ.5,050ల నుంచి రూ. 6,200ల వరకు ధర పలికాయి. కాగా కందులు 796 క్వింటాళ్లు, వేరుశనగ 330 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

ఉపశమనం



బడ్జెట్లో రూ.12 లక్షల వార్షిక ఆదాయం వరకు ఉపశమనం కలిగించే విధంగా ప్రకటన చేయడం హర్షణీయం. గతంలో రూ.12 లక్షల వార్షికాదాయం ఉన్న వారు రూ. 80 వేలు ఆదాయ పన్ను చెల్లించేవారు. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రకటన మేరకు ఆదాయ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

- కొత్తగడి అంజిరెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్

సామాన్యులకు ఊరట



పెరిగిన ఖర్చులు, విద్యార్థుల ఫీజులు, నిత్యావసర వస్తువుల ధరలపై విశ్లేషణ చేసిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు, మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చింది. ఎలక్ట్రానిక్ వాహనాల ధరలు తగ్గనున్నాయి. సామాన్యులు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించింది.

- ఆకుల నందకుమార్, టీపీఆర్‌ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వికారాబాద్

సాదాసీదాగా..



ఇది సాదాసీదా బడ్జెట్. 8 శాతం జీడీపీ సాధ్యం చేయాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెంచే ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై దృష్టిపెట్టాలి. పరిశ్రమల, వ్యవసాయ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఈ బడ్జెట్‌లో ఇంకా ప్రాధాన్యం ఇవ్వాల్సింది. **- ప్రొఫెసర్ రమణారావు**

ఆశల పల్లకి



బడ్జెట్ ఆమోద యోగ్యంగా ఉంది. రాష్ట్ర, దేశ ప్రజల ఆశలు నెరవేర్చేదిగా ఉంది. రూ. 12 లక్షల వరకు పన్ను లేకపోవడం మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తున్నది.

- విక్రంరెడ్డి, బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేట్ సంస్థల బడ్జెట్



తాండూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థల బడ్జెట్‌లా ఉంది. ఎన్నికల కోసం బిహార్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వరాలు కురిపించింది. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసింది. నిత్యావసర ధరలపై నియంత్రణ చేయలేదు. కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు ఇచ్చేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు స్కీమ్ వర్కర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.


- శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ఉద్యోగులకు ఊరటనిచ్చే బడ్జెట్

దోమ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సగటు వేతన జీవులకు ఎంతో ఊరటనిచ్చింది. గతంలో వార్షిక ఆదాయం రూ.7లక్షలలోపు ఉన్న వారు టాక్స్ మినహాయింపును పొందారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు కూడా ఆదాయపన్ను నుంచి పూర్తి రిబేట్ ప్రకటించడం సంతోషదాయకం.

- మహేంద్రకుమార్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

దేశవ్యాప్తంగా సబ్‌ప్లాన్ అమలు చేయాలి



యాలాల: దేశవ్యాప్తంగా సబ్‌ప్లాన్ అమలు చేయాలి. దేశంలో 20కోట్ల జనాభా కలిగి ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపు జరగలేదు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను అంకెల్లో పెంచుతూ వాటిని ఖర్చు చేయడంలో ఘోరంగా విఫలమైంది. దశాబ్దకాలంలో కేంద్ర బీజేపీ సర్కారు దళితులకు కేటాయించిన బడ్జెట్, ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. బడ్జెట్‌లో దళితులకు జరిగిన అన్యాయంపై దళితులంతా ఐక్యంగా పోరాటం చేయాలి.

- ఉప్పలి మల్కయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పటేల్ చెరువు కట్టకు మరమ్మతు చేయించాలని రేగడిమైలారం గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు శనివారం ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు.

వేరుశనగ ధర తగ్గించడంపై ఆందోళన

ధారూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన బీట్లలో ఖరీదుదారులు వేరుశనగ ధరను తగ్గించడంపై శనివారం రైతులు ఆందోళనకు దిగారు. బీట్లను అడ్డుకుని ధరపెంచి కొనుగోలు చేయాలని వేరుశనగ రైతులు పట్టుబట్టారు. దీంతో మార్కెట్ అధికారి సిద్దమ్మ జోక్యం చేసుకుని అడ్తిదారులు, ఖరీదుదారులు, రైతులతో మాట్లాడి ఇతర మార్కెట్లలో వేరుశనగ ధరలను పరిశీలించి ధరను పెంచి కొనుగోలు చేయించారు.ఇతర మార్కెట్‌లలో ధరల కన్నా ఇక్కడి తగ్గించి కొనుగోలు చేస్తున్నారనరి, తమకు క్వింటాలుకు రూ. 6వేల పైన ధర పెడితేనే విక్రయిస్తామని లేకుంటే లేదని వేరుశనగ రైతులు భీష్మించారు. ధరను పెంచి కొనుగోలు చేయాలని మార్కెట్ అధికారి సిద్దమ్మ ఖరీదుదారులకు సూచించారు. అనంతరం జరిగిన బీట్లలో వేరుశనగ క్వింటాలుకు రూ. 6,200ల నుంచి రూ. 5,050ల వరకు ధర పలకటంతో రైతులు వేరుశనగ పంటను విక్రయించారు.



మార్కెట్‌లో వేరుశనగ బీట్ల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి హెచ్చరించారు. శనివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు అందించే పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు గుడ్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని టీచర్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సీడీపీవో రజనితో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరా చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

మున్సిపాలిటీల్లో పక్కాగా పౌరసేవలు

తాండూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పక్కాగా పౌరసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీల ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్ అన్నారు. తాండూరు మున్సిపాలిటీని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల అధికారులు, శానిటేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు కనీస సౌకర్యాలైన పారిశుధ్యం, తాగు నీరు, వీధీ దీపాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశించారు.ఆస్తి పన్ను వసూళ్లలో తాండూరు మున్సిపాలిటీ వెనుకబడడానికి గల కారణాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ మణిపాల్ పాల్గొన్నారు.

కొడంగల్ నుంచే దండయాత్ర

(7వ పేజీ తరువాయి)

రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. అంబేడ్కర్ స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నామని, మన దేశంలో అంబేడ్కర్‌ను కొన్ని వర్గాలకు పరిమితం చేసే ప్రయత్నం బాధాకరమన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జనాన్ని భారీగా తరలించారు.

కేసీఆర్ హయాంలోనే న్యాయం

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక్క పరిగి నియోజకవర్గంలోనే 54 గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చి, రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పాల్గొన్నారు.

అడుగడుగునా ఘనస్వాగతం

పూడూరు: మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. వీరు కుల్కచర్ల మండల పరిధిలోని దాస్యనాయక్ తండాకు వెళ్తున్న క్రమంలో పూడూరు మండలంలోని సోమన్‌గుర్తి సమీపంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతోపాటు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సోమన్‌గుర్తి గేటు వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం దాస్యనాయక్ తండాలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ర్యాలీగా వెళ్లారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయాలి

తాండూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : 'లక్షల డప్పులు వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన పేరిట' ఈనెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు పిలుపునిచ్చారు. తాండూరు పట్టణం అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం లక్ష డప్పుల్ల వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.

కొడంగల్: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలంటూ ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టే 'లక్ష డప్పులు, వేయి గొంతుకలు మహాప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, కార్యదర్శి ఆర్.అంజి, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్ బాబు పిలుపునిచ్చారు. కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం మహా ప్రదర్శన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

వికారాబాద్: లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని పెద్దఎత్తున పార్టీలు, సంఘాలకు అతీతంగా విజయవంతం చేయాలని మాదిక సామాజికవర్గ యువకులకు పిలుపునిస్తున్నట్లు యువ నాయకులు మంచన్‌పల్లి సురేష్ అన్నారు. వికారాబాద్ క్లబ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు.

కులకచర్ల: ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిక పిలుపు మేరకు చేపట్టే లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. బొంరెడ్డిపల్లిలో శనివారం సమావేశం నిర్వహించి డప్పులతో దరువు వేశారు.

దివ్యాంగులకు పూర్తి సబ్సిడీతో రుణాలు

వికారాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకానికి సంబంధించి దరఖాస్తు గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా పూర్తి సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.12 లక్షల సబ్సిడీతో 24 యూనిట్లు జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీ.ఓబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 40శాతం దివ్యాంగత్వం ఉండి, వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులని, ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.2 లక్షలు ఉండాలని, తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని ఆర్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎన్కెపల్లి గ్రామంలో శనివారం ప్రజాపాలనలో లబ్ధిదారులు అందించిన దరఖాస్తులను ఆయన ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐలు సరిత పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి అన్నారు. మోమిన్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అలీమొద్దీన్, రవీందర్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

దౌల్తాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన ఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. గుండెపల్లికి చెందిన నర్సమ్మకు పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. తాండూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఉడిమేశ్వరం గేటు దగ్గర పురిటి నొప్పులు అధికం కావడంతో గమనించిన అంబులెన్స్ సిబ్బంది ప్రసవం చేశారు. నర్సమ్మ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స నిమిత్తం ఆమెను తాండూర్ మాతా శిశు ఆసుపత్రికి తరలించారు.

'అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి'

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి రాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు జగదీశ్ సాగర్, డప్పు జనార్ధన్, అడివయ్య డిమాండ్ చేశారు. వారు మండల కేంద్రంలోని దళిత వాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు.

డాక్టర్‌ను నియమించాల్సిందే

ధారూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ధారూరు పశువైద్యశాలలో డాక్టర్‌ను నియమించాలని ధారూరు రైతుసంఘం నాయకులు ప్రవీణ్ గౌడ్, నారాయణ రెడ్డి, లక్ష్మణ్‌లు శనివారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందంకు వినతి పత్రం అందజేశారు. పశువైద్యాధికారిగా పనిచేసిన శ్వేత డిప్యూటేషన్ పై వెళ్లిపోవటంతో పోస్టు ఖాళీగా ఉందని ఆయన దృష్టికి తెచ్చారు. డాక్టర్ లేకపోవటంతో పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం సానుకూలంగా స్పందించి వైద్యశాలకు డాక్టర్‌ను నియమిస్తాననని హామీ ఇచ్చారన్నారు.

అనాసక్తి

ధారూరు పశువైద్యశాలలో విధులు నిర్వహించటానికి పశువుల డాక్టర్లు అయిష్టత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మండలంలో పనిచేసిన ఓ అధికారి సస్పెండ్ కావటం, ఇతర రాజకీయ ఒత్తిడిల కారణంగా వేరే వైద్యులు ఇక్కడ పోస్టింగ్ తీసుకోవటానికి వెనుకంజ వేస్తున్నారని సమాచారం. ఈ ప్రాంతానికి రావడానికి డాక్టర్లు అనాసక్తి చూపుతున్నందున జిల్లా ఉన్నతాధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.



సదానందానికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సంక్షిప్తంగా..

పోటీ పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సులు

వికారాబాద్: కానిస్టేబుల్, ఎస్ఐ, వీఆర్వో, గ్రూపు 3, 4 పోటీ పరీక్షలకు వసంత పంచమి సందర్భంగా ఈనెల మూడు, నాలుగు తేదీలలో ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు బీ.వీ రమణ, స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9441022571 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

దౌల్తాబాద్: అల్లాపూర్ చెరువు కట్ట నుంచి దౌల్తాబాద్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగుతుండటంతో కాంగ్రెస్ నాయకులు మాటూర్ హన్మంతు తన సొంత నిధులతో జేసీబీ ద్వారా ముళ్ల పొదలను తొలగింపజేశారు.

గద్దర్ జయంతి వేడుకలు

మేడ్చల్ టౌన్: ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మేడ్చల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, మర్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కులకచర్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద కులకచర్ల శివాయంలో దగ్గర రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి వారు భూమి పూజ చేశారు.

కవితను కలిసిన మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్: మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మున్సిపాలిటీ, మండలానికి చెందిన నాయకులతో పాటు ఇటీవ పదవీ కాలం పూర్తి చేసుకున్న కౌన్సిలర్లు ఎమ్మెల్సీ కవితను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చౌడాపూర్: మండల కేంద్రంలోని మక్త వెంకటాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సేవాలాల్, మరియమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వస్త్ర దుకాణాదారుడు వెంకట్ దాసు రూ.21వేలు విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు అల్పాహారం

కోట్‌పల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 250మంది పదో విద్యార్థులకు అల్పాహారం అందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు శనివారం మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్, వెంకటనరసింహారెడ్డి, తిరుమలయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

ఘట్‌కేసర్: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల గాయత్రీ దేవాలయం 19వ వార్షికోత్సవ పూజలను శనివారం ఆయన ప్రారంభించారు.

ప్రజల అభిమానం వెలకట్టలేనిది

ఘట్‌కేసర్: ప్రజల అభిమానం వెలకట్టలేనిదని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన పనిపై శనివారం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన విషయం గమనించిన అభిమానులుశాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి. నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

శామీర్‌పేట: మండల కేంద్రం శామీర్‌పేటలోని పెద్ద చెరువు ప్రాంతంలో వెలసిన శ్రీశివభక్త మార్కెండేయస్వామి జన్మదిన వేడుకలను శనివారం అంగరంగవైభవంగా, ఘనంగా నిర్వహించారు.

క్రైం కార్నర్

విద్యుత్ సిబ్బందిపై హాస్టల్ నిర్వాహకుడి దాడి.. కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయి బిల్లు చెల్లించుమన్నందుకు ఓ హాస్టల్ నిర్వాహకుడు విద్యుత్ సిబ్బందిపై దాడిచేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణం, బుగ్గబాయి కాలనీకి చెందిన గోపాలకృష్ణ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. తనకున్న హాస్టల్ భవనానికి 15కరెంటు మీటర్లకుగాను రూ.80వేల బిల్లు పెండింగ్‌లో ఉంది. బిల్లుచెల్లించాలని విద్యుత్ సిబ్బంది వినోద్‌కుమార్, పవన్, లక్ష్మణ్‌లు కోరగా గోపాలకృష్ణ ఆగ్రహంతో అసభ్యకరంగా దూషిస్తూ వారిపై దాడికి యత్నించాడు. దాడి చేస్తున్న విషయాన్ని సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తుండగా ఫోన్ లాక్కొని ధ్వంసం చేశాడు. విద్యుత్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

కొడంగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కేశవరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 27వ తేదీన విధులు ముగించుకొని కొడంగల్ నుంచి కోస్గిలోని తన ఇంటికి వెళ్తుండగా నాచారం గ్రామ స్టేజీ దగ్గర బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన కేశవరెడ్డిని మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు.

రోడ్డుకిరువైపులా మొక్కలు దగ్ధం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా ఉన్న మొక్కలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. గమనించిన గ్రామస్థులు, పూజారి నర్సింహులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కొడంగల్ నుంచి అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పేశారు.



దగ్ధమవుతున్న మొక్కలు

'అక్రమాలకు పాల్పడితే వదిలిపెట్టం'

పెద్దేముల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ హెచ్చరించారు. పెద్దేముల్ మండలంలో 2023 - 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం కింద రూ.9 కోట్ల 32 లక్షల 90వేల 215 విలువగల పనులు జరిగాయి. మెటీరియల్ కోసం రూ.40,83,854 ఉపాధిహామీ నిధుల నుంచి వ్యయం చేశారు. ఈ పనులకు సంబంధించి శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు.

కీసర ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు స్వీకరణ

కీసర రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా కస్తూరాజు శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకటయ్య ఎల్బీనగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లగా, మహేశ్వరం ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన కే.శ్రీనివాస్ కీసర ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగతం పలికారు.

రహదారులకు రూ. 5.40 కోట్లు

తాండూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న గిరిజన ప్రాంత రహదారులకు రూ. 5.40 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శనివారం వెల్లడించారు. ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించారని అన్నారు. యాలాల మండలం పగిడిపల్లి నుంచి పటేల్ చింత తండా వరకు రూ. 1.85 కోట్లు, దేవనూర్ నుంచి దుబ్బల తండా వరకు రూ. 1. 85 కోట్లు, బషీరాబాద్ మండలం నీళ్లపల్లి రోడ్డు నుంచి వయా హంక్యా నాయక్ తండా మీదుగా బాబు నాయక్ తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.70కోట్లు మంజూరయ్యాయన్నారు.

నూతన ఆవిష్కరణలకు హ్యాకథాన్ వేదిక

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హ్యాకథాన్‌లు నూతన ఆవిష్కరణలకు వేదికలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కళాశాల వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్‌బ్రిడ్జి ఆధ్వర్యంలో శనివారం హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేపీఐఆర్‌టీ కళాశాల డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు రవీంద్ర ఏక్లార్కర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్ కశ్యప్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

తాండూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తాండూరు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిసింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో అధిక సీట్లు గెలవాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేకు పీసీసీ అధ్యక్షుడు సూచించినట్లు సమాచారం.



మహేష్‌గౌడ్‌ని శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధితుడికి రూ.20లక్షల ఆర్థిక సాయం

కీసర రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో నగరంలోని హుస్సేన్ సాగర్‌లో భారత్‌మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాహారతి కార్యక్రమంలో బాణసంచా పేలుడు ప్రమాదంలో నాగారం మున్సిపాలిటీకి చెందిన సిలివేరి అజయ్ మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. మృతుడికి నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి చలించిపోయారు. భారత్‌మాత ఫౌండేషన్ ద్వారా రూ.20లక్షల చెక్కును అందజేసారు. బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పట్లోల్ల విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవాసమితి కన్వీనర్‌కు పీహెచ్‌డీ ప్రదానం

ధారూరు, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేరెల్లిలోని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కె.రామకృష్ణా రెడ్డి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. 'కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌ఓ విభాగంలో ఇమేజ్ మైనింగ్ టెక్నిక్‌ల భిన్నమైన అవసరం' అనే అంశంపై పరిశోధన చేసి భగవంత్ విశ్వవిద్యాలయం, ఆజ్మీర్ నుంచి గత నెల 25న ఆయన పీహెచ్‌డీ పట్టా పొందారు. శ్రీసత్యసాయి గ్రామీణ సార్వజనీక కేంద్రం ప్రధానకార్యదర్శి ఎం.ప్రేమ్‌కుమార్, కోశాధికారి వెంకట్రామి రెడ్డి, కుటుంబసభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.



పట్టాను అందుకుంటున్న రామకృష్ణారెడ్డి